

## పుస్తకం.. వ్యక్తిత్వాన్ని మారుస్తుంది

(5వ పేజీ తరువాయి)

పుస్తకమే అని, మనిషిని మహనీయునిగా తీర్చిదిద్దగలిగేది పుస్తక పఠనమే అని నొక్కిచెప్పారు. పల్లెల్లో చైతన్యం తీసుకురావాలి అనే సంకల్పంతో, తాను ఇంటినే గ్రంథాలయంగా మార్చడంతో పాటు పన్నెండు గ్రంథాలయాల స్థాపనకు తోడ్పాటు అందించినట్లు తెలిపారు. రెండు లక్షల పుస్తకాలతో కొలువుదీరిన తన గ్రంథాలయానికి నిత్యం సుదూర ప్రాంతాల నుంచి పరిశోధక విద్యార్థులు వస్తుంటారని వివరించారు. వారిలో 11 మంది పీహెచ్‌డీ డాక్టరేట్లు పొందారని తెలిపారు. గద్దర్, రవ్వా శ్రీహరిలతో తనకున్న అనుబంధాన్ని కూరెళ్ల గుర్తుచేశారు. ఆచార్య రవ్వా శ్రీహరి సాహిత్య, సాంస్కృతిక వేదికను ప్రారంభించిన ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకపఠనం సంస్కృతిగా మారాలని ఆకాంక్షించారు. అనేక పుస్తకాలు ఒకచోట లభ్యం అవ్వడంతో పాటు పుస్తకాభిమానులంతా కలుసుకోడానికి ఇదొక మంచి వేదిక అని అన్నారు. కొందరు వ్యక్తిగత చొరవతో గ్రామాల్లో గ్రంథాలయాలు నెలకొల్పి, తద్వారా పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ గ్రంథాలయాల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. గ్రంథాలయాల్లో 30 ఏళ్లుగా నియామకాలు లేవని, పదేళ్లుగా పుస్తకాల కొనుగోళ్లు ఆగిపోయాయని విచారం వ్యక్తంచేశారు. కొత్త ప్రభుత్వం గ్రంథాలయాలను పటిష్ఠ పరచాలని కె. శ్రీనివాస్ కోరారు. సభాధ్యక్షత వహించిన బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలోనూ పుస్తక పాఠకులు తగ్గడంలేదనడానికి కోల్‌కతా బుక్ ఫెయిర్‌కు లభించిన ఆదరణ నిదర్శనం అన్నారు. గద్దర్ పేరుతో జానపద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని బుక్ ఫెయిర్ వేదికగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. గద్దర్ కుమార్తె వెన్నెల మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లే ముందు కూడా గద్దర్ పుస్తకం చదివారని తెలిపారు. ఎన్ని పనులున్నా, రోజుకు ఒక గంటైనా పుస్తక పఠనానికి కేటాయించే వారని, ఆయన్ను చూసి తమ కుటుంబ సభ్యులు పుస్తక పఠనాన్ని అలవర్చుకున్నట్లు వెన్నెల తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాస్ రెడ్డి, సుధా భాస్కర్, కవి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

**ఉచితం సముచితం కాదంటూ..**

పుస్తక మహోత్సవాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ అమర వీరుల స్మారక స్థూపంతో పాటు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, గద్దర్ ఫౌండేషన్, నవ తెలంగాణ, తెలుగు వికీపీడియా, అక్షరయాన్ స్టాళ్లను ఆవిష్కరించారు. ఏడాదికి ఒకసారి కాదు, రెండు సార్లు పుస్తక ప్రదర్శన నిర్వహించడానికి తమ ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. బుక్ ఫెయిర్ నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రచురణలను ఆ శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మంత్రికి బహూకరిస్తుండగా, పుస్తకాలు ఉచితంగా తీసుకోవడం సముచితం కాదంటూ వెల చెల్లించారు. మరొక స్టాల్‌లోనూ అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం, గోల్కొండ చరిత్ర, గద్దర్ సాహిత్యాన్ని మంత్రి కొనుగోలు చేశారు.

**బుక్‌ఫెయిర్‌లో నేటి కార్యక్రమాలు**

- **మధ్యాహ్నం 2గంటలకు :** బాల వికాస్ కార్యక్రమాల ప్రారంభం
- **సాయంత్రం 5.30 గంటలకు :** పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో గులాబీల మల్లారెడ్డి రచనల ఆవిష్కరణ
- **సాయంత్రం- 6 గంటలకు :** గద్దరన్న యాదిలో
- 8 గంటలకు జానపద కళారూపాల ప్రదర్శన

**బుక్ ఫెయిర్ సందర్శన వేళలు**

- మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

- లెల్లె సురేష్ దర్శకత్వంలో గద్దర్ జీవితం ఆధారంగా స్వప్నమైన నిజం నృత్య రూపకాన్ని చిందు ఆర్గనైజేషన్ కళాకారిణిలు ప్రదర్శించారు.
- భూపతి వెంకటేశ్వర్లు దర్శకత్వంలో 'మన చరిత్ర' నాటకాన్ని ముషీరాబాద్‌కు చెందిన చిన్నారులు ప్రదర్శించారు. తమదైన అభినయంతో చిన్నారులు సభికులను ఆకట్టుకున్నారు. ప్రదర్శన

## పీవీకి భారతరత్న.. మురిసిన సాహితీలోకం

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):** భారతరత్నకు ఎంపికైన పాములపర్తి వెంకట నరసింహారావుకు హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. ఉమ్మడి కరీంనగర్‌లోని వంగర గ్రామంలో పుట్టిన ఆయన వృత్తి, రాజకీయ వ్యవహారాల నేపథ్యంలో నగరంలో చాలాకాలం నివసించారు. దేశ అత్యున్నత పురస్కారం వరించిన వేళ భాగ్యనగరంలో ఆయన జ్ఞాపకాలు స్మరించుకుంటే.. తొలినాళ్లలో పీవీ నరసింహారావు ప్రముఖ న్యాయవాది బూర్గుల రామకృష్ణారావు (తర్వాత హైదరాబాద్ ముఖ్యమంత్రి) వద్ద కొంతకాలం జూనియర్‌గా ప్రాక్టీసు చేశారు. 1940-50 మధ్యకాలంలో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, భారతీయ కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాలు సుల్తాన్‌బజార్‌లో ఉండేవి. అప్పట్లో రాజకీయ సమావేశాలకు ఆ ప్రాంతమే అడ్డా. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పీవీ స్వామి రామానంద తీర్థ అనుయాయిగా తనవంతు పాత్ర పోషించారు. గురువు పేరుతో బేగంపేటలో ట్రస్ట్‌ను నెలకొల్పారు. తద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నారాయణగూడలోని ప్రముఖ సాహితీ పరిశోధకుడు పల్లా దుర్గయ్య (ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎం.ఏ. తెలుగు పట్టా పొందిన తొలివ్యక్తి) ఇంటి ఆవరణం సాహితీ సమావేశాలకు కేరాఫ్. ఆ ఇంటి చుట్టుపక్క గదుల్లో ప్రముఖ సాహితీ దిగ్గజాలు బిరుదురాజు రామరాజు, దాశరథి కృష్ణమాచార్య తదితరులు అద్దెకుండేవారు. అక్కడే వారంతా కలిసి వారానికొకసారి సాహితీ సమావేశాలు నిర్వహించేవారు. ఆ చర్చలకు వట్టికోట, సినారె, కాళోజీతోపాటు పీవీ నరసింహారావు తరచుగా హాజరయ్యేవారని పలు రచనల ద్వారా తెలుస్తోంది.

**భాషా నిలయంలో..**

ప్రజాకవి కాళోజీతో పీవీ నరసింహారావుకు స్నేహబంధం ప్రత్యేకమైంది. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం వేదికగా ఆనాటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న పీవీ.. కాళోజీ షష్టిపూర్తి మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని నిర్వహించిన తీరే ఇరువురి మైత్రీబంధానికి ఉదాహరణ. ఆయన దేశానికి నేతైనా తన చిన్ననాటి మిత్రుడు కాళోజీ చేత మాత్రం 'ఏరా' అని పిలిపించుకోగలిగిన గొప్ప స్నేహితుడు పీవీ అని "మన భారత ప్రధాని" రచన ద్వారా అవగతమవుతోంది.

## కక్షతో హత్య..

(5వ పేజీ తరువాయి)

అతడి స్నేహితుడు వినోద్‌కుమార్ వస్తుంటారు. ఆ మహిళ కుమార్తెతో వినోద్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. రామన్న కూడా ఆమెపై మనసు పడ్డాడు. ఈ విషయం వినోద్‌కు తెలిసింది. రామన్న తీరుపై వినోద్ నొచ్చుకుని విషయాన్ని మణికంఠకు చెప్పాడు. ఇదే అదునుగా ఇద్దరూ కలిసి రామన్న చంపాలనుకున్నారు. రౌడీషీటర్ కైసర్‌తో హత్యకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పథకం ప్రకారం.. మహిళ కుమార్తెతో రామన్నకు ఫోన్ చేయించి లక్ష్మీనర్సింహనగర్‌కు పిలిపించారు. అక్కడకు మణికంఠ, వినోద్ తదితరులు వచ్చి కత్తులతో రామన్నపై దాడి చేశారు. అతడి మర్మాంగాలను కోసి దారుణంగా హత్య చేశారు. స్నేహితుడైన ఫిరోజ్‌కు వినోద్ వీడియో కాల్‌లో చూపించాడు. అనంతరం కార్లలో పారిపోయారు. ఓ బార్ వద్ద పార్టీ చేసుకున్నారు. బాణాసంచా కాల్చారు. హత్య గురించి సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు తగిన ఆధారాలతో మణికంఠ, వినోద్, కైసర్, అతడి కావలి శివకుమార్, కప్పల నిఖిల్, తున్న కుమార్‌తోపాటు మహిళ, ఆమె కుమార్తెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## 6 నుంచి 11 వరకు కీసర బ్రహ్మోత్సవాలు

**కీసర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):** మహాశివరాత్రి సందర్భంగా మార్చి 6 నుంచి 11 వరకు కీసరగుట్టలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ చెప్పారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఉత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేసి, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు.

# పర్యవేక్షణ లోపం..

- సర్కార్ భూములు అన్యాక్రాంతం
- ఖాళీగా ఉన్న శేరిలింగంపల్లి తహసీల్దార్ పోస్టు

**గచ్చిబౌలి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలోనే శేరిలింగంపల్లి పెద్ద మండలం. కోట్లాది రూపాయల విలువైన భూములు ఇక్కడ ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. రెండు నెలల క్రితం ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాస రావు అధికారుల ఆదేశంతో జీఓ నెంబర్ 59 కింద నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది వ్యక్తులకు భూములు ధారాదత్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ వ్యవహారం నడిచింది. తరువాత వెలుగులోకి రావడంతో ఆయనను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రాజేందర్‌నగర్ ఆర్డీఓ వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మండల కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఓ సర్వేయర్ ఉన్నారు. వీరిలో ఎవరో ఒకరు సెలవుపై వెళ్తున్నారు. ఓ అధికారి రోజూ కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రస్తుతం శేరిలింగంపల్లి తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది.

**● ఇబ్బంది పడుతున్న ప్రజలు**

శేరిలింగంపల్లి మండలంలో సుమారు 6,50,000 లక్షల పైచిలుకు జనాభా ఉన్నారు. 15 గ్రామాలకు చెందిన భూములు మండల పరిధిలో ఉన్నాయి. రెగ్యులర్ అధికారి లేకపోవడంతో పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు కుల, ఆదాయం, స్థానికత వంటి ధ్రువపత్రాలను తప్పనిసరిచేసింది. విద్యార్థులకు సైతం మండల కార్యాలయంతో ఎంతో అవసరం ఉంటుంది. జీవో నెంబర్ 59 కింద ఇళ్ల స్థలాలు, ఇళ్లను రెగ్యులరైజ్ చేయించుకున్న వారు కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఏదో ఒక పనిపై వందలాది మంది రోజూ కార్యాలయానికి వస్తున్నారు. వారికి సమాధానం చెప్పే వారు లేకపోవడంతో అసంతృప్తికి గురవుతున్నారు.



శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం

**● ప్రభుత్వానికి అధిక రాబడి**

శేరిలింగంపల్లి మండలం ఐటీ, మెడికల్, ఎడ్యుకేషన్ హబ్‌గా వెలుగొందుతోంది. ప్రభుత్వానికి ఇక్కడి నుంచి అధిక రాబడి వస్తోంది. అందువల్ల తహసీల్దార్ కార్యాలయం ప్రాధాన్యత సంతరించుకుంది. మండలంలో జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న వారు 25 వేల మంది ఉన్నారు. వారిలో 20 శాతం మందికి కూడా రిజిస్ట్రేషన్ కాలేదు. దీంతో వారు రోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం రోజుకు 300 దరఖాస్తులు వస్తున్నాయి. పూర్తిస్థాయి తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

## చెరువుల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

**కూకట్‌పల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి పరిధిలోని చెరువులను పూడ్చివేస్తూ స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అధికారులను ఆదేశించారు. మూసాపేట పరిధిలోని మైసమ్మ చెరువును పూడ్చి వేస్తున్నట్టు తెలియడంతో ఆయన శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారు 5 ఎకరాల చెరువు స్థలంలో మట్టి, బండరాళ్లు నింపి ఆక్రమించుకోనే ప్రయత్నం చేస్తున్నట్టు గుర్తించారు. ఈసందర్భంగా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల ప్రమేయం లేకుండా చెరువులు కబ్జాకు ఎలా గురవుతాయని ప్రశ్నించారు. మైసమ్మ చెరువులో వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మట్టి, బండ రాళ్లను నింపిన వారిపై కేసులు నమోదు చేయాలని, చెరువులో పోసిన మట్టి, బండరాళ్లను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో, జోనల్ కమిషనర్, ఇరిగేషన్ ఎస్‌ఈతో బండి రమేష్ ఫోన్‌లో మాట్లాడి, అక్కడి పరిస్థితిని, అధికారుల పనితీరుపై వివరించారు. చెరువులను పరిరక్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వామి, ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, జీహెచ్‌ఎంసీ ఏసీపీ మల్లేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కృష్ణరాజ్‌పుత్, సంతోష్, మహ్మద్ నజీరుద్దీన్, రేష్మ, చున్నూ పాషా తదితరులు పాల్గొన్నారు.



మూసాపేటలో కబ్జాకు గురవుతున్న మైసమ్మ చెరువును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు

## రియల్ ఎస్టేట్ అనుకూలత కోసం రుద్రయాగం

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):** రియల్ ఎస్టేట్ రంగంలో ప్రతికూల పరిస్థితులు నెలకొన్న తరుణంలో అనుకూలత కోసం విజన్ గ్రూప్ చైర్మన్ డా. నాగం తిరుపతి రెడ్డి మాదాపూర్‌లో విజన్ గ్రూప్ ప్రధాన కార్యాలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం శుక్రవారం నిర్వహించారు. బ్రహ్మశ్రీ అరుణ్ ఆచార్య ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణలతో గణపతి పూజ, కలశపూజ, నవగ్రహ పూజ, పరమేశ్వరి సహిత పరమేశ్వర పూజాది కార్యక్రమంతో మొదలైన మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం పూర్ణాహుతితో ముగిసింది. ఈ సందర్భంగా విజన్ గ్రూప్ చైర్మన్ డా. నాగం తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రియల్ ఎస్టేట్ రంగం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోందని, దీన్ని అధిగమించడానికి దైవానుగ్రహం కోసం ఈ యాగాన్ని మొదలు పెట్టినట్టు తెలిపారు. త్వరలోనే పరిస్థితులు చక్కదిద్దుకొని రియల్ ఎస్టేట్ రంగం పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



రుద్రయాగం నిర్వహిస్తున్న విజన్‌గ్రూప్ చైర్మన్ డా. నాగం తిరుపతి రెడ్డి

## రామ్ మిరియాల గానం.. హోరెత్తిన 'గీతం'

**పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):** సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రాంగణంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ప్రమాణ - 2024 ఉత్సవాలను శుక్రవారం కామినేని ఉపాసన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రామ్ మిరియాల గానాలతో గీతం ప్రాంగణం హోరెత్తింది. ఆటో షోతో శ్రీకారం చుట్టుకుంది. ఈ షో మిరిమిట్లు గొలిపింది. ఆటోమొబైల్ పరిశ్రమలో తాజా పురోగతులను తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న విభిన్న నేపథ్యాల విద్యార్థులను ఆకర్షించింది. ఆడీ ఆర్‌8, బీఎండబ్ల్యూ, స్కోడా వంటి అత్యాధునిక, ఖరీదైన కార్లు, సీబీజెడ్, కవాసాకి వంటి బైకులు ప్రాంగణంతో సందడి చేశాయి. ప్రమాణ ఉత్సవాల్లో భాగంగా రోజంతా వివిధ కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. శనివారం సాయంత్రం భారత్‌లోనే పేరొందిన ప్రముఖ డీజే ప్రాజెక్ట్ 91, స్కాట్లాండ్ నుంచి వస్తున్న ప్రపంచ ప్రసిద్ధ నినా సుర్దా నిర్వహించనున్న సంగీత హోరు (ఎలక్ట్రానిక్ డాన్స్ మ్యూజిక్ డీజే)తో ముగియనున్నాయి.





పాటలు పాడుతున్న రామ్ మిరియాల, శివుడి వేషధారణలో విద్యార్థి

## 'నవజ్యోతి'లో వైజ్ఞానిక ప్రదర్శన

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):** రంగారెడ్డినగర్ డివిజన్ పట్వారీ నగర్‌లోని నవజ్యోతి పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఫియాస్టా 2024)ముగింపు కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం చైర్మన్ శివయ్య, సంఘం సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరై, విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని శివయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో నవజ్యోతి విద్యా సంస్థల చైర్మన్ మలిరెడ్డి ఇందిరా రవీందర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షులు వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్ యాదవ్, కోశాధికారి దయాకర్, పాఠశాల అకాడమీ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న శివయ్య, సంఘం సభ్యులు

## ముగ్గురు గంజాయి సరఫరాదారుల అరెస్టు



పోలీసుల అదుపులో అర్జున్‌గౌడ్, బాదల్‌రౌత్, విష్ణువర్ధన్‌రెడ్డి

**చందానగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):** రెండు వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... బీరంగూడకు చెందిన బి.అర్జున్‌గౌడ్ ఐటీ కంపెనీలో ఉద్యోగి. నెలరోజుల్లో రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ అరకు వెళ్లి గంజాయి తీసుకొచ్చి తెలిసిన వారికి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు గురువారం రాత్రి అతడి ఇంట్లో సోదాలు చేయగా, 1.5కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

**నల్లగండ్లలో...**

చందానగర్ పోలీస్ స్టేషన్‌పరిధిలోని నల్లగండ్లలో గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా మేడ్చల్ జిల్లా కాప్ర మండలం అశోక్‌నగర్‌కు చెందిన బాదల్‌రౌత్, అదే కాలనీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి డ్రైవర్లు. వీరు శేరిలింగంపల్లిలో గంజాయి విక్రయిస్తున్నారు. గురువారం రాత్రి నల్లగండ్ల సర్కిల్‌లో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటో వదిలి పారిపోతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వీరి నుంచి 4.1కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

**గంజాయి మొక్కలను పెంచుతున్న ఇద్దరి అరెస్ట్**

**జీడిమెట్ల:** భూదేవిహిల్స్‌లో గంజాయి మొక్కను పెంచుతున్న వ్యక్తిని జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు దిలీప్ కుమార్‌షాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

**గోపీనగర్‌లో..**

**చందానగర్:** చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపీనగర్‌లో ఆనంద్ ఇంటి ఆవర్ణలో గంజాయి మొక్కను పెంచుతున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు పరిశీలించారు. 5.5 గంజాయి మొక్కను స్వాధీనం చేసుకొని ఆనంద్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## సన్మానం



ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రభారిగా నియమితులైన బీజేపీ రాష్ట్ర నాయకులు ఎల్.నరేందర్‌రెడ్డిని శుక్రవారం ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు డివిజన్ల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రవీంద్రరావు, రామరాజు, కుమార్‌యాదవ్, కేశవరావు, మణిభూషణ్, అరుణ్‌కుమార్, వేణుగోపాల్, భూపాల్‌రెడ్డి, నర్సింగ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

- హైదర్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి)

## నాలా పనులు వేగవంతం చేయాలి

**అల్లాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):** లక్ష్మీనగర్ నుంచి మైసమ్మ చెరువు వరకు నాలాను అభివృద్ధి చేయడంతో పాటు రామారావునగర్ నాలా పనుల్లో వేగం పెంచాలని కార్పొరేటర్ సబీహ బేగం శుక్రవారం జీహెచ్‌ఎంసీ జెడ్‌సీ అభిలాష్ అభినవ్‌కు విన్నవించారు. కేఎస్.నగర్, రాణా ప్రతాప్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్, గాయత్రినగర్ బస్తీల ప్రజలు రైల్వే ట్రాక్ దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారని, తగిన చర్యలు తీసుకుని అండర్‌పాస్ నిర్మించాలని సబీహ బేగం ప్రతిపాదించారు.



జెడ్‌సీ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సబీహ బేగం

## అయోధ్య రామ్‌లల్లా దర్శనానికి వెళ్లిన భక్తులు

**ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):** అయోధ్య దర్శన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధినుంచి అయోధ్యకు బయలు దేరి వెళ్తున్న భక్తులను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీశ్‌రెడ్డి సాదరంగా సాగనంపారు. వారి మెడలో కాషాయం కండువాలు వేసి ప్రయాణం, స్వామి వారి దర్శనానికి అవసరమయ్యే కిట్లను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో పుష్యమాస అమావాస్య సందర్భంగా ఉప్పల్ భగాయత్ కాలభైరవ స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో హరీశ్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యే పూజలు చేశారు.



అయోధ్యకు వెళ్తున్న భక్తులకు కిట్లు అందజేస్తున్న హరీశ్‌రెడ్డి



● అయోధ్య రామ్‌లల్లా దర్శనం కోసం బాలానగర్ నుంచి బయలు దేరి వెళ్తున్న భక్తులను సాదరంగా సాగనంపుతున్న సీనియర్ నాయకుడు ధారం వెంకటేశం గుప్తా, బాలానగర్ డివిజన్ బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, రమేష్

- బాలానగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి)

## షాపు యజమానులకు జరిమానా

**గాజులరామారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):** ప్రధాన రోడ్డుపై అడ్డుగా భవన నిర్మాణ వ్యర్థాలను పారబోసిన షాపు యజమానులపై కాలనీ అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గాజులరామారం డివిజన్‌లోని మహదేవపురం చౌరస్తాలో 100 ఫీట్ల రోడ్డు ప్రజా రవాణాకు అందుబాటులో ఉంది. 50 ఫీట్ల రోడ్డులో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. సగం రోడ్డుపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వేరే ప్రాంతాల నుంచి ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చిన మట్టిని రోడ్లపై గుట్టలుగా పోశారు. దీంతో అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు స్పందించి వ్యాపారులకు రూ. 30వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో అధికారులు, మహదేవపురం కాలనీ అసోసియేషన్ సభ్యులు దుగ్యాల ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వెంకటిరెడ్డి, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



షాపు యజమానులకు జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

## అనుమానాస్పద వ్యక్తులపై నిఘా

**జీడిమెట్ల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):** చింతల్ సాయినగర్‌లో అర్ధరాత్రి వేళ అనుమానాస్పదంగా తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తులపై స్థానికులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలో, ఆకతాయిలో తెలియదు. అర్ధరాత్రి సాయినగర్ రోడ్‌నెంబర్ 3లో తిరుగుతూ ఇళ్లను ఫొటోలు తీస్తున్నారు. ఈదృశ్యాలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన కాలనీ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.



అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు

## 'సేవాలాల్ విగ్రహ ఏర్పాటు అభినందనీయం'

**జేఎన్‌టీయూ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):** సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 15న రాష్ట్ర ప్రభుత్వం ఐచ్ఛిక సెలవు ప్రకటించడం సంతోషంగా ఉందని బంజారా విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులకు బంజారాల తరఫున ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## నేడు కట్టమైసమ్మ జాతర



**షాపూర్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):** సూరారం కట్టమైసమ్మ జాతర శనివారం ప్రారంభం కానున్నదని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే జాతరలో పలు పూజా కార్యక్రమాలు ఉంటాయని, సోమవారం రంగం, భవిష్యవాణి, బూతబలి, పోత రాజుల విన్యాసం, ఫలహారాల బండి ఊరేగింపు, బుధవారం మధ్యాహ్నం భోజనంతో జాతర ముగుస్తుందన్నారు.

## నులిపురుగుల నివారణ, పల్స్‌పోలియోపై అవగాహన

**గచ్చిబౌలి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):** జాతీయ నులుపురుగుల వారోత్సవాల సందర్భంగా ఈనెల 27న నులిపురుగుల నివారణ కార్యక్రమం చేపట్టనున్నట్టు శేరిలింగంపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ చందర్ తెలిపారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని తెలిపారు.

**మార్చి 3న పల్స్‌పోలియో**

శేరిలింగంపల్లి మండలం పరిధిలో మార్చి 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామని మండల వైద్యాధికారి చందర్ తెలిపారు. మండల పరిధిలో 72,687మంది చిన్నారులు ఉన్నారని, వారికి పోలియో చుక్కలు వేసేందుకు 151 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూడు మొబైల్ వ్యాన్లు, బస్టాపులు, రైల్వేస్టేషన్‌ల్లో సైతం కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ స్వామి, పీహెచ్‌ఎం శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## 'దేశ వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలి'

**పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):** ఈనెల 16న దేశ వ్యాప్తంగా రైతులు, కార్మికులు తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ భవన నిర్మాణ నాయకులు పిలుపునిచ్చారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్ పారిశ్రామిక వాడ ఏఐటీయూసీ కార్యాలయం వద్ద శుక్రవారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసు పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు నాగప్ప బాలాజీ, మోహన్‌రావు, సలీమ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.